


తల్లి.. ఊరడిల్లి..

ఒకటి కాదు.. రెండు కాదు. ఏకంగా నాలుగు రోజుల 19 గంటల పాటు తమ పిల్లల ఆచూకీ తెలియకపోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

8లో



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి శనివారం తూర్పు డెల్టాకు 3,200, మధ్య డెల్టాకు 2 వేలు, పశ్చిమ డెల్టాకు 5,500 క్యూసెక్కుల చొప్పున గోదావరి జలాలు విడుదల చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్

	ఆదివారం (సాయంత్రం)
రాజమండ్రి	6.24
కాకినాడ	6.24
అమలాపురం	6.24

విశ్వావసంతానికి నాంది

- సంస్కృతి, సంప్రదాయ, భక్తి సమ్మేళనమే ఉగాది
- నేటి నుంచి శ్రీవిశ్వావసు సంవత్సరం



సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం)/కొత్తపేట: కాలంలో వచ్చే మార్పులకు నాంది ఉగాది. శిశిరంలో ఆకులు రాలి మోడువారిన చెట్లు లేత చివుళ్ల తొడుగుతూ.. ప్రకృతి కొత్తందాలను అద్దుకునే కాలం ఇది. జీవితంలో కొత్త ఆశలకు, ఆశయాలకు పునాది ఈ ఉగాది. తెలుగువారి మొట్టమొదటి పండుగ ఇది. మామిడి పూతలు.. శ్రవణానందకరమైన కోయిలల కూతలు.. పండితుల పంచాంగ పఠనాలు.. ప్రత్యేక పూజలు.. కొత్త దుస్తులు.. పిండి వంటలు.. బంధుమిత్రుల సందళ్లతో అందరికీ పునరుత్తేజాన్ని అందించే నవ వసంతం ఆగమిస్తున్న వేళ.. శ్రీ విశ్వావసు నామ నూతన తెలుగు సంవత్సరానికి ఆనందంగా స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. గతించిన శ్రీ క్రోధి నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరంలో అందరికీ మరింత మంచి జరగాలని కోరుకుంటూ నూతన సంవత్సరానికి ఆహ్వానం పలుకుతున్నారు. అచ్చ తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే గోదావరి పల్లెల్లో ప్రజలు ఇళ్లను శుభ్రం చేసుకుని, వాకిళ్లను రంగురంగుల రంగవల్లులతో అలంకరించారు. గుమ్మాలకు మంగళప్రదమైన మామిడి తోరణాలు కట్టారు. కొత్త దుస్తులు ధరించి, షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడి తయారు చేసుకుని, ఆలయాలను దర్శించి, ఏడాది పొడవునా తమ కుటుంబాలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించేలా అనుగ్రహించాలని, తలపెట్టిన పనులన్నీ సజావుగా పూర్తయ్యేలా కరుణించాలని ఇష్ట దైవాలను ప్రార్థించేందుకు సిద్ధమయ్యారు. తెలుగువారి పండుగల్లో మొట్టమొదటిదైన ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణాలకు వివిధ ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు. అలాగే, ఉగాది కవి సమ్మేళనాలకు కూడా పలు సాహితీ సంస్థలు ఏర్పాట్లు చేశాయి.

శ్రీవిశ్వావసు అంటే..



ఈ సంవత్సరానికి రాజు సూర్యుడు. విశ్వావసు అంటే అన్నీ సమృద్ధిగా లభించేది అని అర్థం. ఈ సంవత్సరం ఉగాది ఆదివారం కావడంతో సూర్యునికి నవనాయక ఆధిపత్యం లభించింది. రాజు రవి, మంత్రి చంద్రుడు, సేనాధిపతి కుజుడు. మన దేశం అభివృద్ధి పథంలో కొనసాగుతుంది. సేనాధిపతి కుజుడు కావడం వలన సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం కనపడుతుంది. అకాల వర్షాలు, వర్షాకాలంలో తీవ్ర ఉష్ణోగ్రతలు, మన రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో తుపానుల వంటి విపత్తులు కనిపిస్తాయి. తృణధాన్యాలకు గిరాకీ పెరుగుతుంది. బంగారం ధరలకు రెక్కలు వస్తాయి.

– చిలకమర్తి ప్రభాకర చక్రవర్తిశర్మ, తెలుగు, ఆంగ్ల పంచాంగకర్త, రాజమహేంద్రవరం

ఉగాది పచ్చడిలో ఆరోగ్య రహస్యం



ఉగాది రోజున అందరూ స్వీకరించే ఉగాది పచ్చడి మన జీవితంలోని సుఖదుఃఖాలకు సూచిక. ఒక్కో రుచికి ఒక్కో అర్థం. జీవితంలో ఆనందం, రుచికి సంకేతంగా ఉప్పును పరిగణిస్తారు. తెలివిగా వ్యవహరించాల్సిన పరిస్థితులను పులుపు తెలియజేస్తుంది. బాధను దిగమింగాలని లేదా భరించాలని వేప పువ్వులోని చేదు సూచిస్తుంది. సంతోషానికి ప్రతీకగా బెల్లాన్ని భావిస్తారు. సహనం కోల్పోవడాన్ని కారం సూచిస్తుంది. పచ్చి మామిడి ముక్కల్లో తగిలే వగరు రుచి కొత్త సవాళ్లను ఎదుర్కోవడం గురించి తెలియజేస్తుంది.

– డాక్టర్ పీవీటీ సంజీవరావు, తెలుగు శాఖాధిపతి, ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రవరం

కాలం పరమాత్మ స్వరూపం



'కాలాత్మక పరమేశ్వర రామ' అనే కీర్తన కాలం పరమేశ్వర స్వరూపమని చెబుతోంది. విశ్వావసు అనే శబ్దానికి 'విశ్వమంతా వ్యాపించే కాంతి కిరణాలు గలది' అనే అర్థాన్ని గ్రహించవచ్చు. వసు అంటే సంపద అని కూడా అర్థం ఉంది. నూతన తెలుగు సంవత్సరం అందరి జీవితాల్లో సిరిసంపదలు, సుఖసంతోషాలు నింపుతుందని ఆశిద్దాం.

– శలాక రఘునాథశర్మ, మహామహోపాధ్యాయ, రాష్ట్రపతి పురస్కార గ్రహీత

రుషి మార్గం మేలు



తిథి, వారం, నక్షత్రం, యోగం, కరణం అనే అంశాలతో కూడినది పంచాంగం. ఖగోళంలో సూర్యచంద్రులు, ఇతర గ్రహాల పరిభ్రమణం వలన ప్రకృతిపరమైన మార్పులు, మన జీవితాల్లో అవి చూపే ప్రభావం అర్థం చేసుకోవడానికి మన ప్రాచీన రుషులు ఏర్పరచిన విధానం పంచాంగ శ్రవణం. నూతన సంవత్సరాది వేళ మధుపాన సేవనంతో, అసభ్యకరమైన నృత్యాలతో అర్ధరాత్రి చిందులు వేయడం కాదు. రుషులు చూపిన శాస్త్రీయ మార్గంలో గడపాలి.

– డాక్టర్ సీఎస్‌వీ రమణీ కుమారి, రిటైర్డ్ తెలుగు పండిట్, రాజమహేంద్రవరం

తెలుగువారి తొలి పండగ



ఉగాది తెలుగు వారి మొదటి పండగ. ఈ రోజు నుంచే వసంత నవరాత్రులు ప్రారంభమవుతాయి. ఈ రోజున పంచాంగ శ్రవణం వల్ల మహా ఫలితం కలుగుతుంది. ప్రతి ఒక్కరి జీవితంలో కష్టసుఖాలకు ప్రతీకగా తీపిచేదుల కలబోత అయిన ఉగాది పచ్చడిని స్వీకరించడం సంప్రదాయంగా వచ్చింది. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం అందరి జీవితాల్లో ఆనందం నింపాలి.

– పిడపర్తి రవికుమార్ శర్మ, వేద పండితుడు, పలివెల, కొత్తపేట మండలం



వసతి గృహాల్లో సీసీ కెమెరాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. సంక్షేమ శాఖల అధికారులతో శనివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమయ్యే నాటికి సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలను హేతుబద్ధీకరణ విధానంలో అభివృద్ధి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రహరీలు నిర్మించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరితగతిన పరిష్కరించాలని, దీనిపై నెలవారీ ప్రగతి నివేదిక అందజేయాలని ఆదేశించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, నిరుద్యోగ యువతకు డీఎస్సీ శిక్షణ ఇవ్వడంపై కళాశాల స్థాయిలో అవగాహన కల్పించాలని కోరారు. సమావేశంలో జిల్లా సాంఘిక, గిరిజన, బీసీ సంక్షేమ అధికారులు ఎంఎస్ శోభారాణి, కేఎస్ జ్యోతి, బి.శశాంక పాల్గొన్నారు.

కోరుకున్న రోజే రిజిస్ట్రేషన్

- అందుబాటులోకి స్లాట్ బుకింగ్ సేవలు
- ఒకటి నుంచి ప్రయోగాత్మకంగా అమలు

రాజమహేంద్రవరం రూరల్: మంచి ముహూర్తంలో ఆస్తుల రిజిస్ట్రేషన్ చేసుకోవాలనుకునే వారికి ఆ శాఖ అవకాశం కల్పిస్తోంది. నచ్చిన రోజు.. నచ్చిన సమయం ఎంపిక చేసుకొని వెబ్‌సైట్‌లో స్లాట్ బుక్ చేసుకుంటే చాలు.. కార్యాలయం వద్ద గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు.. ఎంచుకొన్న రోజు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే పని పూర్తి చేసుకొని గంటల్లోనే ఇంటికి చేరుకోవచ్చు. ఈ కొత్త విధానాన్ని ఏప్రిల్ 1 నుంచి రాజమహేంద్రవరంలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ విధానాన్ని విజయవాడలోని కంకిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. అక్కడ విజయవంతం కావడంతో అన్ని జిల్లాల్లో దీనిని దశలవారీగా అమలు చేస్తున్నారు. సాధారణంగా మంచి ముహూర్తాలు, మంచి రోజుల్లో ఎక్కువ మంది ఆస్తుల రిజిస్ట్రేషన్లు చేయించుకుంటారు. ఒకే సమయంలో క్రయవిక్రయదారులు రావడంతో ఎక్కువ సమయం వేచి ఉండాల్సి వస్తోంది. ఈ సమస్యకు చెక్ చెప్పేందుకు స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలులోకి తెస్తున్నారు. దీని ప్రకారం గంటకు ఆరుగురికి స్లాట్ బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. ఒకవేళ ఆ రోజు ఆ సమయానికి రాకపోతే మళ్లీ కొత్తగా స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ విధానంపై జిల్లాలోని సీనియర్ అసిస్టెంట్లకు ఇప్పటికే తాడేపల్లిలోని ఐజీ కార్యాలయంలో శిక్షణ ఇచ్చారు. మొదట జిల్లా కేంద్రంలో దీనిని ప్రయోగాత్మకంగా అమలు చేసి, తర్వాత అన్ని కార్యాలయాల్లో ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. జిల్లాలో మొత్తం 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. వీటిలో రోజుకు 200 నుంచి 250 వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం, రాజానగరం, కడియం, పిడింగొయ్యి, అనంతపల్లి, కొవ్వూరు, నిడదవోలులో అత్యధికంగా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి.

వేచి చూసే పని ఉండదు



స్లాట్ బుకింగ్ విధానం వలన క్రయవిక్రయదారులకు కార్యాలయంలో వేచి చూసే పని తప్పుతుంది. కావాల్సిన సమయానికి రిజిస్ట్రేషన్‌కు హాజరు కావచ్చు. దీనిపై పూర్తి విధివిధానాలు రావాల్సి ఉంది.

– ఆర్.సత్యనారాయణ, జిల్లా రిజిస్ట్రార్



ఐక్యంగా జీవిస్తూ.. మత సామరస్యం చాటుదాం



ప్రత్యేక ప్రార్థనలో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: అందరం ఐక్యంగా ఉంటూ మత సామరస్యాన్ని చాటి చెబుదామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. బొమ్మూరులోని బిలాల్ మస్జిద్‌లో మాజీ వైస్ ఎంపీపీ, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత నక్కా రాజబాబు ఆధ్వర్యాన శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ముస్లిం జీవితంలో ఈ ఈద్ వెలుగులు నింపాలని అల్లాహ్‌ను కోరుకుంటున్నానన్నారు. అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

జిల్లా ప్రజలకు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరికీ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సరంలో అందరి జీవితాల్లో కొత్త కాంతులు వెల్లివిరియాలని, అందరి ఆశలు, ఆశయాలు నెరవేరాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని అన్నారు.



క్లుప్తంగా

జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా జయలక్ష్మి



కాకినాడ లీగల్: స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కాకినాడ జిల్లా ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా తూర్పుగోదావరి జిల్లా మార్కెట్ అండ్ ఆడిట్ జిల్లా రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్న జె.జయలక్ష్మి నియమితులయ్యారు. ప్రస్తుత రిజిస్ట్రార్ కె.ఆనందరావు ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ మేరకు జయలక్ష్మి శనివారం బాధ్యతలు స్వీకరించారు.

ఇద్దరిపై హత్యాయత్నం
ముగ్గురి అరెస్టు

తాళ్లరేవు: పి.మల్లవరం గ్రామ పంచాయతీ పత్తిగొందిలో ఇద్దరు యువకులపై హత్యాయత్నం జరిగింది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు శనివారం రాత్రి గ్రామంలో జరుగుతున్న జాతరలో యువకుల మధ్య కొట్లాట జరిగింది. ఈ నేపథ్యంలో కె.నాగబాబు, ఎం.వీరకుమార్ అనే యువకులపై పలువురు కత్తులతో దాడిచేశారు. ఈ దాడిని స్థానికులు అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. గాయపడిన యువకులను హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా వారు చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ, కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ ఘటనకు సంబంధించి ఈ.ఈశ్వరచందు, ఈ.రాజేష్, ఈ.సాయిచంద్ర అనేక యువకులను అరెస్టు చేశారు. పాత గొడవల నేపథ్యంలోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు స్థానికులు చర్చించుకుంటున్నారు.

రైలు నుంచి జారిపడి వృద్ధురాలి మృతి



అట్టాడ సరస్వతమ్మ (ఫైల్)

తుని: తుని నుంచి అన్నవరం వైపు వెళ్తున్న రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందినట్టు జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. శనివారం అందిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి సోషల్ మీడియా ద్వారా అన్ని పోలీసు స్టేషన్లలో విచారణ చేయగా పలాసకు సమీపంలోని సైలాడ గ్రామానికి చెందిన అట్టాడ సరస్వతమ్మ (70)గా గుర్తించామన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

తల్లి.. ఊరడిల్లి..

- తప్పిపోయిన విద్యార్థుల ఆచూకీ లభ్యం
- నాలుగు రోజుల 19 గంటల ఆందోళనకు తెర
- తల్లిదండ్రులు మందలించారని వెళ్లిపోయిన వైనం
- కథ సుఖాంతంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



ఆలమూరు ఖండ్రిగపేటలో ఆందోళన చెందుతున్న చిన్నారుల తల్లులు

ఆలమూరు/పి.గన్నవరం/అమలాపురం టౌన్: ఒకటి కాదు.. రెండు కాదు. ఏకంగా నాలుగు రోజుల 19 గంటల పాటు తమ పిల్లల ఆచూకీ తెలియకపోవడంతో ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. అప్పుడప్పుడూ పిల్లలు చెప్పా పెట్టకుండా బంధువుల ఇళ్లకు వెళ్లినా ఒకటి రెండు రోజులలో తిరిగి వచ్చేవారు. కాని ఈసారి ఐదు రోజుల పాటు వారి ఆచూకీ తెలియకపోవడం.. పైగా తమపై అలిగి ఆరుగురు పిల్లలు ఇళ్ల వదిలి వెళ్లిపోవడంతో ఆ తల్లిదండ్రులు రెండు, మూడు రోజులుగా మనో వేదనకు గురయ్యారు.

ఆలమూరు ఖండ్రిగ పేటకు చెందిన ఆరుగురు విదార్థులు ఈ నెల 24వ తేదీన అదృశ్యమైన విషయం తెలిసిందే. వీరిలో కొమరగిరి కరుణ స్థానిక బొబ్బా జయశ్రీ బాలికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతుండగా, కొమరగిరి పృథ్వీవర్మ కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి, గంధం సత్యనారాయణ ఎనిమిదో తరగతి, మద్రి సంతోష్ ఏడో తరగతి, కొమరగిరి క్రాంతికుమార్ అలియాస్ పండు ఆరో తరగతి చదువుతున్నారు. కొమరగిరి మాధురి రామచంద్రపురం పలవరీ ఎయిడెడ్ స్కూల్ నందు ఏడవ తరగతి చదువుతోంది.

స్థానికంగా ఉండే యానాదులు రెక్కాడితే కాని డొక్కాడని కుటుంబాలు. కాయ కష్టం చేసుకుని జీవనోపాధి పొందుతున్నారు. వ్యవసాయ చేలు, తోటలలో ఎలుకలు పట్టడం.. నదీపాయలు, కాలువల్లో చేపలు, రొయ్యలు వేటాడి విక్రయించడం ద్వారా ఉపాధి పొందుతున్నారు. తాము పడే కష్టం తమ పిల్లలకు రాకూడదని వారిని ఉన్నత చదువులు చదివించాలని భావించారు. అయితే తమ పిల్లలు చదువులో రాణించకపోవడం.. పాఠశాలలకు తరచూ డుమ్మాకొడుతున్నారని ఉపాధ్యాయులు చెప్పడంతో వారు పిల్లలను మందలించారు. దీంతో ఆ ఆరుగురు కట్టకట్టుకుని ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. వీరిలో ఎనిమిదో తరగతి చదువుతున్న కరుణ ఇంటిలో ఉన్న రూ.మూడు వేలు తీసుకు వెళ్లినట్టు తల్లి కృపావతి తెలిపింది. ఖండ్రిగ పేటలో రెండు రోజులుగా తల్లిదండ్రులు, వారి బంధువుల ఆందోళనలతో నిశ్శబ్దంగా మారింది. ఒకే కాలనీకి చెందిన ఆరుగురు పిల్లలు అలిగి ఇంటి నుంచి వెళ్లిపోవడం, నాలుగు రోజులైనా వారి ఆచూకీ తెలియకపోవడంతో వారి కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు ఆందోళనతో గడిపారు. పలువురు కంట తడిపెట్టుకుంటూ పిల్లల కోసం ఎదురు తెన్నులు చూశారు. మధ్యాహ్న సమయంలో పిల్లల ఆచూకీ పోలీసులకు తెలిసిందని తెలియడంతో ఆ పేట వాసుల ఆనందానికి అవధులు లేవు. పిల్లలు క్షేమంగా ఉన్నారనే సమాచారంతో ఒక రోజు ముందే వారికి సంవత్సరాది వచ్చినట్టయ్యింది. ఒకరిని ఒకరు పట్టుకుని సంతోషాన్ని పంచుకున్నారు.

24 గంటల్లో ఛేదించాం : ఎస్పీ కృష్ణారావు

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీని 24 గంటల్లోనే తెలుసుకున్నామని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. అమలాపురంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల అదృశ్యంపై ఐదు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని తెలిపారు. విజయవాడ, రాజమహేంద్రవరం, ఏలూరు, భీమవరం, కోనసీమలోని పలు మండలాలకు పోలీసులను పంపించి గాలించామన్నారు. ఆయా ప్రాంతాల్లో సీసీ పుటేజీలు, డ్రోన్ కెమెరాలకు తోడు సోషల్ మీడియా పాత్ర కూడా విద్యార్థుల ఆచూకీని గుర్తించడంలో తమకు ఉపయోగపడిందని ఎస్పీ వివరించారు. దొరికిన ఆరుగురి విద్యార్థులను పోలీసులు ఎస్పీ కార్యాలయానికి తీసుకుని వచ్చి సాయంత్రం ఎస్పీ కృష్ణారావు సమక్షంలో వారి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థుల ఆచూకీని గుర్తించడంలో కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీ మోహన్‌తో పాటు ఆలమూరు, పి.గన్నవరం, రావులపాలెం పోలీసు స్టేషన్ల సిబ్బంది శ్రమించారని ఎస్పీ వివరించారు. విద్యార్థుల అదృశ్యం కేసు 24 గంటల్లో ఛేదించిన కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం రూరల్, పి.గన్నవరం సీఐలు విద్యాసాగర్, రుద్రరాజు భీమరాజులకు ఆయన ప్రశంసాపత్రాలు అందజేశారు. ఏఎస్పీ ప్రసాద్ పాల్గొన్నారు.



పి.గన్నవరం అక్విడెక్టు పై నుంచి డ్రోన్‌తో గాలిస్తున్న బృందాలు



విద్యార్థులతో ఎస్పీ కృష్ణారావు, పోలీసు అధికారులు

మరోసారి ఇలా జరగకూడదు



నా కుమార్తె మాధురి కనిపించకుండా పోయి నాలుగు రోజులు కావడంతో చాలా భయపడ్డాం. అందరూ సహకరించడంతో ఆమె తిరిగి మా వద్దకు వచ్చింది. ఎప్పుడూ ఇలా జరగకూడదని కోరుకుంటున్నాను.

– కె.కృష్ణవేణి

కంటిమీద కునుకు లేదు



మా కుమారుడు క్రాంతికుమార్ (పండు) కనిపించకుండా వెళ్లిపోయి నాలుగు రోజులైనా ఏ విధమైన సమాచారం లేకపోవడంతో నిద్రలేకుండా గడిపాను. ఎక్కడికి వెళ్లినా సాయంకాలం లోపు తిరిగి వచ్చే పండు ఈసారి రాలేదు. నాలుగు రోజుల తరువాత ఆచూకీ లభించడం ఆనందంగా ఉంది.

– కొమరగిరి సత్యవతి

భయాందోళనతో గడిపాం



మా ఇద్దరు పిల్లలు కరుణ, పృథ్వీవర్మ కనిపించకపోవడంతో నాలుగు రోజులుగా బంధువులు, శ్రేయోభిలాషుల కుటుంబాల వద్ద వెతికాము. ఎక్కడా వాళ్లు కనిపించకపోవడంతో భయాందోళనలతో గడిపాము. మా పిల్లల ఆచూకీ కనుగొన్నవారికి ధన్యవాదాలు.

– కొమరగిరి కృపావతి

చాలా ఎదురు చూశాం



నాలుగు రోజులుగా మా పిల్లల కోసం ఎదురు చూస్తున్నాం. మా కాలనీకి చెందిన ఆరుగురు విద్యార్థులు తప్పిపోయారన్న విషయం తెలియడంతో నిద్రలేని రాత్రులు గడిపాం. ఏ సమయానికి ఏ వార్త వినాల్సి వస్తుందోనని భయపడ్డాము.

– గంధం శివపార్వతి

శ్రీనివాసా.. శ్రీ చిద్విలాసా..

వాడపల్లి క్షేత్రం భక్తజన సందోహం



వాడపల్లిలో భక్తజన సందోహం

కొత్తపేట: శ్రీనివాసా.. శ్రీ వేంకటేశా అంటూ భక్తులు శనివారం తన్మయత్వంలో మునిగి తేలారు. వాడపల్లి స్వామివారిని చూసి భక్తిపారవశ్యంతో ఓలలాడారు. శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి క్షేత్రం శనివారం భక్తులతో కిక్కిరిసింది. రాష్ట్ర నలుమూలల నుంచీ భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. డీసీ, ఆలయ ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బందికి అదనపు ఏర్పాట్లు చేశారు. స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఖండవిల్లి ఆదిత్య అనంత శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించారు. స్వామివారిని సుగంధ పరిమళ పుష్పాలతో విశేషంగా అలంకరించారు. అలాగే వేంకటేశ్వర సహిత ఐశ్వర్యలక్ష్మి హోమం నిర్వహించి, భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. భక్తుల సౌకర్యార్థం అదనపు ఏర్పాట్లలో భాగంగా ఫ్లెక్టివర్ నిర్మించారు. స్వామి దర్శనానికి భక్తులు పైనుంచి వెళుతుండగా కింద ఏడు వారాల నోము చేసుకునే భక్తులు ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి దర్శనానంతరం ఆ ప్రాంగణంలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామిని భక్తులు దర్శించుకుని, అన్నప్రసాదం స్వీకరించారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం అత్యధిక సంఖ్యలో భక్తులు దర్శించి, ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో భక్తుల పూజలకు ఏర్పాట్లు చేశారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా భక్తుల పూజలు, తైలాభిషేకాలు టిక్కెట్లు ద్వారా దేవస్థానానికి రూ.3,30,890, అన్నప్రసాదం విరాళాలు రూపంలో రూ.76,782తో మొత్తం రూ.4,07,672 ఆదాయం వచ్చినట్టు ఈఓ తెలిపారు.

బాలాజీకి రూ.1.22 లక్షల ఆదాయం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం విశేష సంఖ్యలో భక్తులు వచ్చారు. సుప్రభాత సేవ, తొలి హారతిని ఘనంగా జరిపించారు. స్వామి వారి సన్నిధిలో జరిగే లక్ష్మీనారాయణ హోమాన్ని భక్తులు దర్శించుకున్నారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1,22,575 ఆదాయం వచ్చింది. స్వామి వారిని 2,600 మంది భక్తులు దర్శించుకున్నారని ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. 1,200 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారన్నారు. లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.16,680 ఆదాయం రాగా నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.36,176 విరాళంగా అందించారన్నారు.

రూ.9.69 లక్షల విలువైన గంజాయి స్వాధీనం

రాజమహేంద్రవరం రూరల్: ఏజెన్సీ నుంచి ఢిల్లీకి గంజాయిని తరలిస్తున్న ముఠా గుట్టును బొమ్మూరు పోలీసులు రట్టుచేశారు. దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద కారు తనిఖీ చేస్తుండగా రూ.9.69 లక్షలు విలువైన 193.300 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. శనివారం సాయంత్రం జిల్లా తూర్పు మండల డీఎస్పీ బి.విద్య వివరాలు వెల్లడించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహకిషోర్‌కు అందిన సమాచారం మేరకు శనివారం దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద గామన్ బ్రిడ్జికి వెళ్లేదారిలో బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్, సిబ్బంది కారును తనిఖీ చేసి గంజాయితో పాటు, రూ.1100 నగదు, ఒక సెల్‌ఫోన్, కారును స్వాధీనం చేసుకుని న్యూఢిల్లీకి చెందిన మనోజ్‌కుమార్‌ను అరెస్టుచేశారు. ఢిల్లీకి చెందిన మనోజ్‌కుమార్, గౌరవ్, మోనో విశాఖ ఏజెన్సీ నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తుంటారు. గంజాయి రవాణాతో వచ్చే ఆదాయంలో వాటా ఇస్తామని గౌరవ్, మోనోలు మనోజ్‌కుమార్‌ను ఒప్పించడంతో అతడు అనకాపల్లి వెళ్లి అక్కడి నుంచి గంజాయి లోడు చేసుకుని కారులో విజయవాడ వెళ్తుండగా పోలీసులకు చిక్కాడు. మనోజ్‌కుమార్‌ను రిమాండ్ నిమిత్తం కోర్టుకు పంపినట్టు డీఎస్పీ తెలిపారు. ఈ కేసులో చురుగ్గా వ్యవహరించిన ఇన్‌స్పెక్టర్ పి.కాశీవిశ్వనాథ్, బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వి రమేష్, హెచ్‌సీ, పీసీలను జిల్లా ఉన్నతాధికారులు అభినందించారు.



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారుతో పాటు అరెస్టు చేసిన నిందితుడితో తూర్పు మండలం డీఎస్పీ విద్య, ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్

1న టెన్త్ సోషల్ పరీక్ష

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): రంజాన్ సెలవు కావడంతో సోమవారం నిర్వహించాల్సిన టెన్త్ సోషల్ పరీక్షను ఏప్రిల్ 1న నిర్వహిస్తున్నట్లు జిల్లా పాఠశాల విద్యా శాఖాధికారి కంది వాసుదేవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్ష ఆ రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకూ జరుగుతుందన్నారు. ఈ మార్పును పరీక్షా సిబ్బంది గమనించాలన్నారు. అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పరీక్ష నిర్వహణ బాధ్యులు ఈ విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.

విద్యార్థినికి న్యాయం చేయండి

మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మత్తు ఇంజెక్షన్ తీసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన ఫార్మసీ విద్యార్థినికి న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కోరారు. విద్యార్థిని చికిత్స పొందుతున్న బొల్లినేని ఆసుపత్రికి రాజా వచ్చి ఆమె ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, ఆమె పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో చక్కగా చదువుకునే ఆమెకు ఆ చదువే శాపంలా తయారుకావడం బాధాకరమన్నారు. ఈ సంఘటనలో తల్లితండ్రులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. ఈ కేసులో నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత శాంతి భద్రతలు పూర్తిగా గాడి తప్పాయన్నారు. బాధిత విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరామన్నారు. ఆమె కుటుంబానికి ఏ అవసరం వచ్చినా ఎప్పుడూ తనవంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు.



ఆసుపత్రిలో విద్యార్థిని కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఆలయాలే లక్ష్యంగా చోరీలు

- పట్టుబడ్డ ఇద్దరు దోపిడీ దొంగలు
- రూ.10 లక్షల విలువైన 10 కేజీల వెండి రికవరీ



స్వాధీనం చేసుకున్న వెండి వస్తువులతో డీఎస్పీ ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, ఎస్సై శేఖర్‌బాబు, తిరుమలరావు తదితరులు

అమలాపురం రూరల్: ఆలయాల్లో దేవుడి ఆభరణాలు, హుండీల్లో నగదు దోచుకునే ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ సర్కిల్ పరిధిలో ఇటీవల వివిధ దేవాలయాల్లో జరిగిన చోరీలకు పాల్పడిన దొంగల వివరాలను అమలాపురం తాలూకా పోలీసు స్టేషన్‌లో శనివారం డీఎస్పీ టీఎస్‌ఆర్‌కే ప్రసాద్, రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, తాలూకా ఎస్ఐ శేఖర్‌బాబుతో కలిసి విలేకరులకు వెల్లడించారు. రూరల్ సీఐ ప్రశాంత్‌కుమార్, తాలూకా ఎస్సై శేఖర్‌బాబు, రూరల్ సర్కిల్ క్రైం పార్టీ కలసి దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. యానాంకు చెందిన మల్లాడి కాసురాజు, పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం ముత్యాలపల్లి గ్రామానికి చెందిన కొల్లాటి తిరుపతి రాజులను అదుపులోకి తీసుకుని విచారించి వారి నుంచి చోరీ చేసిన రూ.10 లక్షల విలువైన 10 కేజీల వెండిని రికవరీ చేసి అమలాపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

నాలుగు ఆలయాల్లో చోరీల వివరాలు ఇవీ..

అమలాపురం రూరల్ మండలం సవరప్పాలెంలో ఫిబ్రవరి 28న రమా సత్యనారాయణ దేవాలయంలో 5 కిలోల 10 గ్రాముల 620 మిల్లీ గ్రాముల వెండి అభరణలు దొంగిలించారు. అల్లవరం మండలం సామంతకుర్రు గ్రామంలో వెంకటేశ్వర ఆలయంలో 4.800 కిలోల వెండి ఆభరణాలు, కొమరగిరిపట్నం సాయిబాబా గుడి తాళాలు పగలగొట్టి హుండీలోని రూ.వెయ్యి నగదు, ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి సంత మార్కెట్ సమీపంలో విజయ కనకదుర్గమ్మ ఆలయంలోని హుండీలోని రూ.1500 నగదు చోరీ చేశారు. కాగా దొంగతనాలకు ఉపయోగించే మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకునట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి 10 కేజీల వెండి, రూ.2500 నగదు, వారు నేరాలకు ఉపయోగించే మోటర్ సైకల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.

వారు కలుసుకున్నది ఇలా..

కొల్లాటి తిరుపతిరాజు డిగ్రీ వరకు చదివి అల్లరి చిల్లరగా తిరిగే వాడు. రైస్ పుల్లింగ్‌తో మోసాలకు పాల్పడేవాడు. కొల్లాటి తిరుపతి రాజుతో అతడికి పరిచయం ఏర్పడింది. ఇటీవల కాలంలో వారు అమలాపురం ఆలయాల్లో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు చిక్కారు. రూరల్ సీఐ ప్రశాంత్ కుమార్, రూరల్ ఎస్సై శేఖర్ బాబు, అల్లవరం ఎస్ఐ తిరుమలరావు, క్రైం పార్టీ ఏఎస్ఐ వి.సుబ్బారావు, హెచ్‌సీ ఏసుబాబు, పీసీలు శివరాకృష్ణ, ఎం.ధర్మరాజు, నాగరాజులను ఎస్పీ కృష్ణారావు అభినందించారని డీఎస్పీ ప్రసాద్ తెలిపారు.